కార్మికులు సమ్మెకు దూరంగా ఉండాలి

- లక్ష్య సాధనలో ప్రతి రోజూ విలువైనదే..
- సింగరేణి సీఎండీ బలరాం విజ్ఞప్తి

గోదావరిఖని/రామగిరి, ఫిబ్రవరి 14 : దేశ వ్యాప్త టోకెన్ సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని సంస్థ సీఎండీ బలరాం కార్మికులను కోరారు. కొన్ని కార్మిక సంఘాలు పలు డిమాండ్లతో ఈనెల 16న దేశ వ్యాప్తంగా ఒకరోజు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయనీ, ఆ సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని కోరారు. సమ్మె డిమాండ్లు సింగరేణి పరిధిలోనివి కావని, అలాంటప్పుడు కార్మికులు సమ్మెలో ఎందుకు పాల్గొనాలో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. ఇప్పటికే పలు కారణాలతో ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపులో కొంత వెనుకబడి ఉన్నామని పేర్కొన్నారు. లక్ష్య సాధనకు ప్రతి రోజు సాధించే ఉత్పత్తి కూడా ఎంతో తోడ్పాటునందిస్తుందని తెలిపారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి నిర్దేశించిన ఉత్పత్తి సాధిస్తూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఒకరోజు సమ్మె చేస్తే సంస్థ నష్టపోయే ఉత్పత్తి విలువ సుమారు రూ.85 కోట్లు ఉంటుందని వెల్లడించారు. కార్మికులు దాదాపు రూ.18 కోట్ల వేతనాలు కోల్పోతారని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం 2022-23లో 67.14 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 66.69 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా జరిపి రూ.2,222.46 కోట్ల లాభాలు ఆర్జించామని, ఆ లాభాల నుంచి బోనస్, సీఎల్ఆర్ బోనస్‌లు ఉద్యోగులకు చెల్లించడంతోపాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 59.13 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని, మిగిలిన 47 రోజుల్లో లక్ష్య సాధనకు ప్రతి రోజు ఎంతో విలువైందని పేర్కొన్నారు. కార్మికులు ఆలోచించి సమ్మెకు దూరంగా ఉండి విధులకు హాజరై ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు.

టోకెన్ సమ్మెకు దూరంగా ఉండండి

రామగిరి, ఫిబ్రవరి 14: ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త టోకెన్ సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఆర్జీ-3 ఇన్‌చార్జి జీఎం ఎస్ రాధాకృష్ణ కోరారు. ఈమేరకు జీఎం కార్యాలయంలో బుధవారం కార్మిక సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ టోకెన్ సమ్మెలో ఏ ఒక్క ఉద్యోగి పాల్గొనవద్దని కోరారు. ప్రతి ఉద్యోగి విధులకు హాజరు కావాలని, గనుల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. సమ్మె నోటీసులు తెలిపిన డిమాండ్లు సింగరేణి పరిధిలో లేవని, అవన్ని కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలని స్పష్టం చేశారు. ఏ ఇతర ప్రభుత్వ రంగ పరిశ్రమలు అమలు చేయని ఎన్నో సంక్షేమ ప్రయోజనాలను సింగరేణి యాజమాన్యం కల్పిస్తున్నదని చెప్పారు. కార్మిక సంఘాలు ఉద్యోగులను పక్కదోవ పట్టించవద్దని సూచించారు. కార్మిక సంఘాల నాయకులు కోట రవీందర్ రెడ్డి, ఆకుల వెంకన్న, అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటరమణ, నాగేశ్వరరావు, డీజీఎం చంద్రశేఖర్, పీఎం రవీందర్ రెడ్డి, ఎస్‌వో లక్ష్మీనారాయణ ఉన్నారు.

పారిశ్రామిక బంద్ విజయవంతం చేయాలి

రామగిరి,ఫిబ్రవరి 14: ఈనెల 16న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. ఈమేరకు ఓసీపీ-1 బేస్ వర్క్‌షాపులో బుధవారం బంద్ పోస్టర్ విడుదల చేశారు. ఇక్కడ నాయకులు నర్సయ్య, రాజనర్సు, ఇమామ సంపత్, రమేశ్, శ్రీనివాస్, లింగన్న, మొండయ్య తదితరులున్నారు.

సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర

జ్యోతినగర్, ఫిబ్రవరి 14: దేశ వ్యాప్త సమ్మెను విచ్చిన్నం చేయడానికి కేంద్రం కుట్రలకు పాల్పడుతున్నదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే రాజన్న ఆరోపించారు. ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. సమ్మెకు మద్దతుగా ఢిల్లీకి వెళ్తున్న రైతులను పోలీసులు అడ్డుకోవడాన్ని ఖండించారు. ఇక్కడ నాయకులు ఈ నరేశ్, చిలుక శంకర్, బీ బుచ్చయ్య, కొమురయ్య, తిరుపతి, రాయమల్లు, శంకర్, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

BUILDING FOR SALE

★గోదావరిఖని జీఎం ఆఫీస్ కాలనీ లోని మేయిన్ రోడ్‌కు ఉన్న ఇండిపెండెంట్ డబుల్ బెడ్ రూమ్ గల బిల్డింగ్ అమ్మబడును. మధ్య వర్తులు లేరు. ఇంటి ఓనర్ సెల్ నెంబర్: 7382437207
NTK-317412

CHANGE OF NAME

★I, AYESHA BATOOL, D/o. Syed Gouse, R/o. 3-6-395, Subash Nagar, Karimnagar, TS. Changed My Name as AYESHA BATHUL, D/o. Syed Gouse.
NT-311754

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

ఘనంగా వసంత పంచమి వేడుకలు

పెద్దపల్లి కమాన్ : సరస్వతీ మాతకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

కోల్‌సిటీ : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

పెద్దపల్లి కమాన్, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలో వసంత పంచమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాలు, విద్యాసంస్థల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పెద్దపల్లి ట్రినిటీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వంసత పంచమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, ట్రినిటీ ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి-పుష్పలత దంపతులు సరస్వతీ పూజ చేశారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్‌లో చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజినీ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. సరస్వతీ మాత వేషధారణతో ఓ విద్యార్థిని ఆకట్టుకుంది కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, రజియొద్దీన్, స్రవంతి, నవీన్, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంథని, జనవరి14: మంథని గౌతమేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని శ్రీ బాల సరస్వతీ, శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయం, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తుల రాకతో ఆలయాలు సందడిగా మారాయి.

ముత్తారం, ఫిబ్రవరి 14: మండలంలోని ఓడేడులోని ప్రగతి విద్యాలయంలో కరస్పాండెంట్ గాండ్ల మల్లయ్య, గాండ్ల దేవేందర్ ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఇక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాల ఆవరణలో బుధవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. శ్రీ జ్ఞాన సరస్వతి దేవి పూజ, విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, కరస్పాండెంట్ వెంకటరెడ్డి-భారతి దంపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలిగేడు, ఫిబ్రవరి 14: మండలంలోని సుల్తాన్‌పూర్ హైస్కూల్ ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ భరోసా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపెల్లి నాగరాజు, సభ్యులు శివజ్యోతి, మంజుల, శ్రీనివాస్, దేవరనేని శోభారాణి, పంగ భాస్కర్, పాత తిరుపతయ్య, సులోచన, సృజన, పద్మ ఉన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

కోల్‌సిటీ,ఫిబ్రవరి 14: లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో గోదావరిఖని శారదానగర్‌లో గల శ్రీ సరస్వతి మాత ఆలయంలో వంద మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంతకు ముందు సరస్వతీ మాతకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, కార్యదర్శి కళావతి, కోశాధికారి మనీషా అగర్వాల్, మీల్స్ ఆన్ వీల్స్ కో-ఆర్డినేటర్ రామస్వామి పాల్గొన్నారు.

పాలకుర్తి, ఫిబ్రవరి14: జీడీనగర్‌లోని యూనివర్సల్ పాఠశాల, ఈసాలతక్కళ్లపల్లి జెమ్స్‌మోడల్ స్కూల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు మహ్మద్ ఇస్మాయిల్, మహేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓదెల మండల వాసికి జాతీయ అవార్డు

ఓదెల, ఫిబ్రవరి 14: ఎనేబుల్ ఇండియా ఆర్గనైజేషన్ బెంగుళూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి దివ్యాంగుల సాధికారత కార్యక్రమంలో భాగంగా ఓదెల మండలానికి చెందిన గజ్జెల్లి సతీశ్‌కు అవార్డు ప్రధానం చేశారు. సతీశ్ కొంత కాలంగా జిల్లాలోని దివ్యాంగులకు చేస్తున్న సేవలను గుర్తించి జాతీయ ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు అందించినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

ఆర్డీవో సమావేశం..

మంథని, ఫిబ్రవరి 14: మంథని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో హనుమానాయక్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బొమ్మారెడ్డిపల్లిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

పుల్వామా అమరులకు నివాళి

ధర్మారం, ఫిబ్రవరి 14: బొమ్మారెడ్డిపల్లిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పుల్వామా అమరులకు బుధవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. 14 ఫిబ్రవరి, 2019లో పుల్వామా వద్ద ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ఎస్ఐ టీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎంపీటీసీ గాగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, ఏఎస్ఐ ఎండీ సాబీర్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

గోదావరిఖని : మాట్లాడుతున్న ఎంవీఐ భీమ్‌సింగ్

గోదావరిఖని/ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 14: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలని రామగుండం ఎంవీఐ భీమ్ సింగ్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ డిపోలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడారు. ఆర్టీసీ బస్ డ్రైవర్లు రోడ్డు భద్రత పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా చేర్చాలని సూచించారు. బస్సు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదని, రోడ్డు క్రాస్ చేసే సమయంలో నిబంధనలు పాటించాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవర్లు కార్మికులు డిపో నుంచి మున్సిపల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంతర్గాం ప్రభుత్వ దవాఖాన డాక్టర్ ఉదయ్ కిరణ్, డీఎం నాగభూషణం, ట్రాఫిక్ మేనేజర్ గీతాకృష్ణ, సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

రోడ్డు మీదకు వచ్చే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు అన్నారు. రామగుండం ట్రాఫిక్ ఠాణాలో ఆయన మాట్లాడారు. గత 15 నుంచి ఈనెల 14వరకు రోడ్డు భద్రత మాసోత్సవాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు భద్రతపై చేపడుతున్న విస్తృత ప్రచారంతోనే ప్రమాదాల సంఖ్య తగ్గుదలకు చేరుకుంటుందన్నారు. ఇక్కడ ట్రాఫిక్ సీఐ రవి, ఎస్ఐ ఉదయ్ ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

పెద్దపల్లి కమాన్, ఫిబ్రవరి 14 : పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ట్రాఫిక్ పోలీసులు, పెద్దపల్లి పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్ సేఫ్టీ పద్ధతులను పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్‌హెచ్‌వో లక్ష్మణ్‌రావు, ఎస్ఐ-2 మల్లేశ్ యాదవ్ వివరించారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మణిగణేశ్, ఎంబీఏ హెచ్‌వోడీ ఆరిఫ్, డిప్లమా ఇన్‌చార్జి వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 14 : పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువును మార్చి 31 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. నాగలేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు కళాశాలల్లోని విద్యార్థులంతా https://telangana epass. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల ఎంపికకు..

బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల ఎంపికకు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి అధికారి ఎం నాగలేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పథకంలో భాగంగా ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

పరామర్శ

పెద్దపల్లి, ఫిబ్రవరి14: ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్, ప్రముఖ న్యాయవాది మేకల మల్లేశం యాదవ్ తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జీ చంద్రయ్య, హైకోర్టు రిటైర్ జడ్జి, రివర్ వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ మెంబర్ పీఎస్ నారాయణ బుధవారం పెద్దపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఇక్కడ సత్యనారాయణరెడ్డి, మూర్తి, శ్రీకాంత్, పర్వతాలు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఫిబ్రవరి 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలువురు ఎంపీడీవోలను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయా మండలాలకు నూతనంగా నియామకమైన పలువురు ఎంపీడీవోలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వారికి ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

మంథని, ఫిబ్రవరి 14: కూచిరాజుపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బూడిద సమ్మయ్య(45) బుధవారం రాత్రి సమయంలో కూచిరాజుపల్లిలోని తన నివాసం నుంచి మంథని- పెద్దపల్లి ప్రధాన రహదారి దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో సమ్మయ్య తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు 108 కు సమాచారం ఇచ్చారు. 108 లో మంథని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. కాగా సమ్మయ్య తలపై తీవ్రగాయం కాగా, పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

సుల్తానాబాద్ రూరల్, ఫిబ్రవరి 14: సుల్తానాబాద్‌లో నివాసం ఉంటున్న బాలకృష్ణ (38) బైక్‌పై వెళ్తుండగా చిన్నకల్వల వద్ద వెనుక నుంచి లారీ ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం పోలీసులు అంబులెన్స్ ద్వారా కరీంనగర్‌కు తరలించారు. గాయపడిన బాలకృష్ణ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

వివాహ వేడుకలకు హాజరైన జడ్పీ చైర్మన్ పుట్ట మధు

వివాహ వేడుకల్లో పాల్గొన్న జడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని, ఫిబ్రవరి 14: జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ బుధవారం పలు వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మంథనిలోని మహాలక్ష్మి గార్డెన్స్‌లో కుడుదుల కిష్టయ్య కుమారుడి వివాహ వేడుకల్లో, ఎస్ఎల్‌బీ గార్డెన్స్ తనుగుల లక్ష్మణ్ యాదవ్ కుమార్తె వివాహ వేడుకల్లో, సుల్తానాబాద్ మండలంలోని కనుకులలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ దుమ్మని లక్ష్మణ్ కుమారుడి వివాహ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

రామగుండం కమిషనర్ బదిలీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 14: రామగుండం కమిషనర్ సీహెచ్ నాగేశ్వరరావు బదిలీ అయ్యారు. ఏడాది క్రితం ఇక్కడకు కమిషనర్‌గా వచ్చిన నాగేశ్వర్‌రావును జీహెచ్‌ఎంసీకి బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపాలిటీలో కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్ శ్రీకాంత్‌ను రామగుండం కమిషనర్‌గా నియమించారు. కాగా బుధవారం రాత్రి కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కమిషనర్ నాగేశ్వర్‌ను శాలువాతో కప్పి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కమిషనర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మేయర్ అనిల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్, సూపరింటెండెంట్ మనోహర్, ఇతర అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సీపీని కలిసిన అధికారులు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 14: రామగుండం పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం శ్రీనివాసులును పలువురు అధికారులు బుధవారం కలిశారు. ముందుగా సీపీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్, ఏసీపీలు తుల శ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు కలిశారు. పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు బల్దియా సమావేశం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 14: రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మేయర్ అనిల్ కుమార్ తెలిపారు. 2023-24కు గాను సవరించిన, 2024-25కు ప్రతిపాదించిన బడ్జెట్‌ను పరిశీలించి ఆమోదించడం కోసం ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 14 : శ్రీరాంపూర్ ఓసీపీలో జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు మొగిళి శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలై కుడికాలు కోల్పోయాడు. కార్మికుల కథనం ప్రకారం.. ఓసీపీలో మట్టి తవ్వకాలు, తరలింపు చేస్తుండగా బుధవారం తెల్లవారు జామున ఐదు గంటలకు వోల్వో డ్రైవర్ తను నడుపుతున్న వాహనాన్ని ముందున్న డంపర్‌కు ఢీకొట్టాడు. దీంతో మొగిళి శ్రీకాంత్ కుడికాలు పూర్తిగా విరిగి వేరుగా పడింది. దీంతో తోటి కార్మికులు శ్రీకాంత్‌ను మంచి ర్యాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ రామగుండం మండలం మూర్మూర్ గ్రామానికి చెందిన వాడు. కాగా రోజూ అక్కడి నుంచే వచ్చి విధులు నిర్వర్తిస్తున్నాడు. శ్రీకాంత్‌కు పరిహారం చెల్లించాలని తాళ్ల పల్లి, సింగాపూర్ కౌన్సిలర్ బండారి సంధ్యా రాణి సుధాకర్ జీవీఆర్ సంస్థ మేనేజర్ పెంచలయ్యను డిమాండ్ చేశారు. డంపర్ ఆపరేటర్లు, కార్మికులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు జోక్యం చేసుకొని ప్రమాదానికి గురైన శ్రీకాంత్‌కు పూర్తి వైద్యం అందించాలని, కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని సూచించిన మేరకు జీవీఆర్ యాజమాన్యం అంగీకరించడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

ఏసీపీల బదిలీలు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 14: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 95మంది ఏసీపీల్లో రెండో విడుతలో జైపూర్ ఏసీపీ మోహన్‌ను హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లోని సీసీఎస్‌లో పనిచేస్తున్న ఆరె వెంకటేశ్వర్లును జైపూర్ ఏసీపీగా నియమించారు. మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డిని ఖమ్మం రూరల్ ఏసీపీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కామారెడ్డి డీఎస్పీ రత్నపురం ప్రకాశ్‌ను నియమించారు. బెల్లంపల్లి ఏసీపీ సదయ్యను ఆసిఫాబాద్‌కు బదిలీ చేశారు. పెద్దపల్లి ఏసీపీగా వరంగల్ సీసీఆర్‌బీలో ఉన్న గజ్జి కృష్ణను నియమితులయ్యారు. సీసీఆర్‌బీ ఏసీపీగా రామగుండం కమిషనరేట్‌లోని ఇటీవల నియమితులైన మాధవిని కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా బదిలీ చేశారు. గోదావరిఖని సబ్ డివిజన్ ఏసీపీగా మడత రమేశ్ నియమితులయ్యారు. గోదావరిఖని ఏసీపీగా ఉన్న తుల శ్రీనివాసరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

అంతర్గాం, ఫిబ్రవరి 14: మండలంలోని ముర్మూర్ గ్రామంలో చెరుకుతోట వంశస్తులు నిర్మించిన రేణుకాఎల్లమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి నాయక్, జూల రాజు, రాజేశ్, ప్రశాంత్, గ్రామస్తులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రామగిరి, ఫిబ్రవరి 14: మండలంలోని బేగంపేట, కల్వచర్ల, రత్నాపూర్, నాగెపల్లిలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల లైసెన్సు వివరాలు, స్టాక్ రికార్డులు పరిశీలించారు. ఎరువుల విక్రయాలను ఈ- పాస్ మిషన్ల ద్వారానే చేపట్టాలని డీలర్లకు సూచించారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. పంటకు అవసరమైన మోతాదులోనే యూరియా, ఇతర ఎరువులు వాడాలని అవసరానికి మించి వాడితే నేల కాలుష్యం జరిగి భవిష్యత్‌లో పంటల సాగుకు పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని వివరించారు.

వైభవంగా పోచమ్మ బోనాలు

బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న ముదిరాజ్ కులస్తులు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 14: మండలంలోని జూలపల్లిలో పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా ముదిరాజ్ కులస్తులు బుధవారం పోచమ్మ బోనాలు చేశారు. డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

డీపీవో బాధ్యతల స్వీకరణ

పెద్దపల్లి, ఫిబ్రవరి14: పెద్దపల్లి డీపీవోగా ఆర్ఏఎస్‌పీ లత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

ధర్మారం,ఫిబ్రవరి14: కటికెనపల్లిలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణ గాయత్రి విద్య-ఆధ్యాత్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ సంస్థానాధిపతి కృష్ణ హంస నేతృత్వంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. వసంత పంచమి సందర్భంగా ఆలయంలో సామాహిక అక్షరాభ్యాసం చేయించారు. గురువారం స్వామి వారి రథోత్సవం (జాతర)తో ఉత్సవాలు ముగుస్తాయి.

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

సుల్తానాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : గర్రెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని చెలుకల సంజన 2023-2024 ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏరువ రఘునాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్త్ లైట్ బ్లూ టు రెడ్యూస్ ట్రాఫిక్ జామ్స్ అనే అంశంపై సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో చేసిన ఎగ్జిబిట్ గాను విద్యార్థిని ఎంపికైంది. ఈ మేరకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ ఎంపికైన వారి జాబితా విడుదల చేసింది. సంజనతో పాటు సైన్స్ టీచర్‌ను ప్రిన్సిపల్ అభినందించారు.

భూసేకరణ పై సమావేశం

ముత్తారం, ఫిబ్రవరి 14: గ్రీన్ ఫీల్డ్ హైవే 163జీ నిర్మాణంలో భాగంగా మండలంలోని మైదంబండలో మంథని ఆర్డీవో హనుమా నాయక్ భూ నిర్వాసిత రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. భూ సేకరణకు సంబంధించి జీపీ కార్యాలయంలో అవార్డు విచారణ నిర్వహించారు. భూమికి పరిహారం ఆర్ఎఫ్‌సీటీ ఎన్ఏఆర్ఆర్ -2013 చట్టం ప్రకారం చెల్లించనున్నట్లు తెలిపారు. ఇక్కడ తహసీల్దార్ సుమన్, ఎంపీటీసీ బియ్యని శ్యామల సదానందం, మాజీ సర్పంచ్ ఎర్రం శారద సదానందం, ఆర్ ఐలు శ్రీధర్, భవానీ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు అధికంగా వాడొద్దు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 14: రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడొద్దని ఏవో బండి ప్రమోద్ కుమార్ రైతులకు సూచించారు. జూలపల్లిలో బుధవారం ఆయన పర్యటించారు. పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. యూరియా ఎరువులను అధికంగా వాడితే భూసారం తగ్గి పంట దిగుబడికి నష్టం వాటిల్లుతుందని వివరించారు. ఆయన వెంట ఏఈవో అజ్మీరా సురేశ్ నాయక్ ఉన్నారు.

'నాంది' సేవాకార్యక్రమాలు

కల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలో నాంది చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ట్రస్ట్‌గా ఏర్పడి ఏటా వసంత పంచమి రోజున పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రక్తదానం చేశారు. ఇద్దరు దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు బెల్లపుకొండ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు కొల్లూరి హరిప్రసాద్, చేతి ధర్మేందర్, బాలే శివప్రసాద్, నల్ల రాజిరెడ్డి, కాసర్ల మల్లారెడ్డి, అల్లం శంకర్, వీరయ్య, సంపత్‌రెడ్డి, రసూల్, కుమార్, సదయ్య, మునీందర్, కృష్ణ చైతన్య, సంతోష్, నరేశ్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

కమాన్‌పూర్, ఫిబ్రవరి 14: మండలంలోని పలు కుటుంబాలకు సుందరం ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చేయూత అందించింది. కమాన్‌పూర్, సిద్దిపల్లె పంచాయతీ పరిధిలోని రాంనగర్‌కు చెందిన మాదాసు సమ్మక్క (60), శాలపల్లికి చెందిన మాటేటి రమేశ్ (50) ఇటీవల చనిపోయాడు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బోనాల వెంకటస్వామి ఫౌండేషన్ తరపున 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో జంగపల్లి, మాటేటి కుమార్, అంబటి కనకయ్య, లింగయ్య, చిప్పకుర్తి అరవింద్, లింగయ్య, నగేశ్, శ్రీకాంత్ ఉన్నారు.